# ఓటమి ఎరుగని నేత

- వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సబితా ఇంద్రారెడ్డి
- ప్రత్యర్థి బీజేపీ అభ్యర్థిపై 26,158 ఓట్ల మెజార్టీతో ఘన విజయం
- గతంలో దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిగా, తెలంగాణలో తొలి మహిళా మంత్రిగా ప్రత్యేక గుర్తింపు

రంగారెడ్డి, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితాఇంద్రారెడ్డి వరుస విజయాలతో రాజకీయాల్లో సత్తా చాటుతున్నారు. ఇప్పటివరకు ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన సబితాఇంద్రారెడ్డి మంత్రిగా పలు హోదాల్లో పనిచేశారు. దేశంలోనే తొలి మహిళా హోంమంత్రిగా, తెలంగాణలో తొలి మహిళా మంత్రిగానూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఈసారి అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్‌లకు చెందిన అగ్రనేతలు ఈ సెగ్మెంట్‌లో ప్రచారం చేసినా సబితాఇంద్రారెడ్డి ఘన విజయం సాధించి తనకు ఎదురే లేదని నిరూపించుకున్నారు. పోలైన మొత్తం ఓట్లలో ఏకంగా 1,25,549(40.98)శాతం ఓ ట్లను పొందడమే కాకుండా..ప్రత్యర్థిపై 26,158 ఓట్ల మెజార్టీతో భారీ విజయాన్ని మూటగట్టుకున్నారు.

### ఎదురులేని నేత..

జిల్లాలోని చేవెళ్ల నియోజకవర్గానికి 2000లో జరిగిన ఉప ఎన్నికలో పోటీచేసి సబితాఇంద్రారెడ్డి గెలుపొందారు. ఆ తర్వాత 2004లోనూ ఇదే సెగ్మెంట్ నుంచే గెలుపొందారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మహేశ్వరం నియోజకవర్గంగా ఏర్పాటు కాగా.. సబితాఇంద్రారెడ్డి ఇక్కడి నుంచి పోటీ చేసి విజయం సాధించారు. 2018లో ఇదే నియోజకవర్గం నుంచి పోటీచేసి గెలుపొందారు. గనులు, భూగర్భ వనరుల శాఖల మంత్రిగా, హోంమంత్రిగా పనిచేశారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత రాష్ట్ర విద్యాశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి స్వరాష్ట్రంలో తొలి మహిళా మంత్రిగా గుర్తింపు పొందారు. 2023లోనూ అదే పరంపరను కొనసాగించి విజయఢంకా మోగించారు.

**మొయినాబాద్ :** కాగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిచిన మంత్రి సబితారెడ్డి చేవెళ్ల మండలంలోని కౌకుంట్ల గ్రామానికి చేరుకుని తన భర్త స్వర్గీయ ఇంద్రారెడ్డి సమాధి వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడిస్థానికులతో మాట్లాడారు.



మంత్రి సబితాఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

### బలం..బలగం ప్రజలే..

ఎన్నికల్లో భారీ మెజార్టీ కట్టబెట్టిన మహేశ్వరం నియోజకవర్గ ప్రజలకు మంత్రి సబితారెడ్డి ధన్యవాదాలు తెలిపారు. ఇబ్రహీంపట్నం సీవీ ఆర్ కాలేజీలో నిర్వహించిన కౌంటింగ్ కేంద్రంలో రిటర్నింగ్ అధికారి చేతుల మీదుగా గెలుపు పత్రాన్ని అందుకున్న సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన గెలుపునకు కష్టించి పనిచేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. తన బలం, బలగం మహేశ్వరం నియోజకవర్గ ప్రజలేనని, వారి ఆశీర్వాదాలు ఎప్పటికీ తనతోనే ఉంటాయని పేర్కొన్నారు. తన గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అనుబంధ సంఘాల నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతానన్నారు.

-సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ మంత్రి

### ప్రత్యర్థి పార్టీల అగ్రనేతలు ప్రచారం చేసినా..

ప్రతి ఎన్నికల్లోనూ సబితాఇంద్రారెడ్డి భారీ మెజార్టీతో ప్రత్యర్థులపై గెలుపొందుతున్నారు. 2009 ఎన్నికల్లో 65,077 ఓట్లను పొంది విజయం సాధించారు. 2018లో 95,481(40.76 శాతం) ఓట్లను సాధించగా.. ఈసారి ఎన్నికల్లోనూ అదే ఒరవడిని కొనసాగించారు. మహేశ్వరం నియోజకవర్గంలో మొత్తం 5,46,654 ఓట్లు ఉండగా.. 3,06,386 ఓట్లు పోలయ్యాయి. అందులో సబితాఇంద్రారెడ్డి 1,25,549(40.98) ఓట్లను సాధించడంతోపాటు ప్రత్యర్థిపై 26,158 ఓట్ల మెజార్టీతో ఘన విజయం సాధించింది. కాంగ్రెస్ పార్టీ నుంచి రాహుల్, ప్రియాంకగాంధీలతోపాటు బీజేపీ నుంచి ప్రధాని మోదీ, అమిత్‌షా వంటి అగ్రనేతలు ఈసారి ఎన్నికల్లో మహేశ్వరం నియోజకవర్గంలో ప్రచారంలో పాల్గొన్న సబితారెడ్డి విజయాన్ని మాత్రం ఆపలేకపోయారు.

స్వర్గీయ ఇంద్రారెడ్డి సమాధి వద్ద నివాళులర్పించేందుకు ర్యాలీగా వెళ్తున్న మంత్రి సబితారెడ్డి





ఎమ్మెల్యేగా గెలుపొందినట్లు నియామకపత్రాన్ని అందుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి శంకరయ్య

భారీగా ఓట్లను చీల్చిన

## సింహం గుర్తు

### పోరాడి ఓడిన బీఆర్ఎస్

షాద్‌నగర్, డిసెంబర్ 3 : బీఆర్ఎస్ పార్టీ షాద్‌నగర్ అభ్యర్థి, ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ చివరి రౌండ్ వరకు పోరాడి ఓటమి చెందారు. ఆదివారం హైదరాబాద్‌లోని లార్డ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి శంకరయ్య బీఆర్ఎస్ అభ్యర్థిపై 7,128 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. నియోజకవర్గంలోని కొత్తూరు, నందిగామ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, కొందుర్గు, చౌదరిగూడ మండలాల్లో 1,94, 27 ఓట్లు పోలవ్వగా..కాంగ్రెస్ అభ్యర్థికి 76,947 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థికి 70, 385, ఏఐఎఫ్‌బీ పార్టీ అభ్యర్థికి 31, 426 ఓట్లు వచ్చాయి. 1,595 ఓట్లు పోస్టల్ బ్యాలెట్ ద్వారా పోల్ అయ్యాయి. ఇందులో బీఆర్ఎస్ అభ్యర్థికి 304, కాంగ్రెస్ అభ్యర్థికి 870, ఏఐఎఫ్‌బీ అభ్యర్థికి 225 ఓట్లు వచ్చాయి. నాల్గో స్థానంలో బీజేపీ అభ్యర్థి బాబయ్యకు సాధారణ ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ఓట్లు మొత్తం కలిపి 8,164 ఓట్లు వచ్చాయి. ఓట్ల లెక్కింపులో మొదటి రౌండ్ నుంచి చివరి 22వ రౌండ్ వరకు కాంగ్రెస్ అభ్యర్థి ఆధిక్యతను ప్రదర్శించారు. ఏఐఎఫ్‌బీ అభ్యర్థికి 31,651 ఓట్లు రావడంతో బీఆర్ఎస్ అభ్యర్థి ఓటమికి కారణమయ్యాయని స్థానిక నేతలు విశ్లేషిస్తున్నారు.

నాలుగు నియోజకవర్గాల్లోనూ..

# కాంగ్రెస్‌దే హవా


- కొడంగల్, వికారాబాద్, పరిగి, తాండూరు సెగ్మెంట్లలో హస్తం పార్టీ అభ్యర్థుల ఘన విజయం
- కొడంగల్‌లో భారీ మెజార్టీతో గెలిచిన రేవంత్ రెడ్డి
- నోటాకు 5101 ఓట్లు

వికారాబాద్, డిసెంబర్ 3 (నమస్తే తెలంగాణ): జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపొందారు. కొడంగల్, వికారాబాద్, పరిగి, తాండూరు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేలుగా ఎనుముల రేవంత్‌రెడ్డి, గడ్డం ప్రసాద్‌కుమార్, రామ్మోహన్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి విజయం సాధించారు. కొడంగల్ నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీచేసిన పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందారు. అదేవిధంగా వికారాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన గడ్డం ప్రసాద్‌కుమార్ రికార్డు సృష్టించారు. వికారాబాద్ నియోజకవర్గం ఏర్పాటైన నాటి నుంచి ఓడిపోయిన వ్యక్తులు గెలిచిన సందర్భంలేదు, అయితే గత రెండు పర్యాయాలు ఓడిపోయిన ప్రసాద్‌కుమార్ ఎమ్మెల్యేగా గెలుపొంది చరిత్రను తిరగరాశారు. అదేవిధంగా తాండూరు నుంచి గెలిచిన మనోహర్‌రెడ్డి పోటీ చేసిన మొదటిసారే ఎమ్మెల్యేగా గెలుపొందడం గమనార్హం. గతంలో జడ్పీటీసీగా, డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన పరిగి నియోజకవర్గానికి చెందిన మనోహర్‌రెడ్డి తాండూరు నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలువడం విశేషం. బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్‌రెడ్డిపై 32,532 ఓట్లతో కాంగ్రెస్ అభ్యర్థి రేవంత్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. రేవంత్‌రెడ్డికి 1,07,429 ఓట్లురాగా, నరేందర్‌రెడ్డికి 74,897 ఓట్లు వచ్చాయి. అదేవిధంగా వికారాబాద్ ఎమ్మెల్యేగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ప్రసాద్‌కుమార్ 12, 671 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ప్రసాద్‌కుమార్‌కు 86,477 ఓట్లురాగా, ఆనంద్‌కు 73,806 ఓట్లు వచ్చాయి. పరిగి ఎమ్మెల్యేగా రామ్మోహన్‌రెడ్డి 22,481 ఓట్లతో గెలుపొందారు, రామ్మోహన్‌రెడ్డికి 96,284 ఓట్లురాగా, మహేశ్‌రెడ్డికి 73,803 ఓట్లు వచ్చాయి. తాండూరు ఎమ్మెల్యేగా 6,583 ఓట్ల మెజార్టీతో మనోహర్‌రెడ్డి గెలుపొందారు. కాంగ్రెస్ అభ్యర్థి మనోహర్‌రెడ్డికి 84,662 ఓ ట్లురాగా, బీఆర్ఎస్ అభ్యర్థి రోహిత్‌రెడ్డికి 78,079 ఓట్లు వచ్చాయి.

### నోటాకు 5102 ఓట్లు..

జిల్లాలో చాలామంది ఓటర్లు నోటాకు ఓటేశారు. అయితే ఏదేని నియోజకవర్గంలో పోటీ చేసే అభ్యర్థులెవరూ నచ్చకపోతే నోటాకు ఓటేసే అవకాశాన్ని ఓటర్లకు ఎన్నికల సంఘం కల్పించింది. అయితే జిల్లాలోని కొడంగల్ నియోజకవర్గంలోనే అధిక మంది ఓటర్లు నోటాకు ఓటేశారు. జిల్లావ్యాప్తంగా 5102 మంది ఓటర్లు నోటాకు ఓటేయగా,...వికారాబాద్ నియోజకవర్గంలో 1398 మంది, తాండూరు నుంచి 592 మంది, కొడంగల్ నుంచి 2002 మంది, పరిగి నియోజకవర్గంలో 1110 మంది ఓటర్లు నోటాకు ఓటేయడం గమనార్హం.

### తాండూరు ప్రజలకు ధన్యవాదాలు



తాండూరు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు. విద్య, వైద్యం, రోడ్ల అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిచ్చి నియోజకవర్గాన్ని ఓ మోడల్‌గా అభివృద్ధి చేస్తా. తాండూరులో కాలుష్యాన్ని పూర్తిగా తగ్గించేందుకు తగు చర్యలు తీసుకుంటా. జిల్లాకు చెందిన రేవంత్ రెడ్డి సీఎం కాబోతున్న దృష్ట్యా ఆయన సహకారంతో నియోజకవర్గాభివృద్ధికి భారీగా నిధులు తీసుకొస్తా.

- బుయ్యని మనోహర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే



ఎన్నికల అధికారి నుంచి గెలుపు పత్రాన్ని పొందుతున్న వికారాబాద్ నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా విజయం సాధించిన గడ్డం ప్రసాద్‌కుమార్



పరిగిలోని ఎన్నికల కౌంటింగ్ కేంద్రం